# చేదునిజాలు

పవని నిర్మల ప్రభావతి



"పార్వతీ! పార్వతీ! పారూ! త్వరగారా! త్వరగా!"
వీధిగుమ్మం మెట్లు ఎక్కుతూనే, కేకలువేశాడు విశ్వం.

"అబ్బబ్బ! ఏమిటా పిలుపులూ? చక్కగావున్న పేరును చిత్రహింస చేసేస్తున్నారు. కాకున్నా ఇదో ఫ్యాషనయిపోయింది. శారదను 'శారూ' అని, సరోజను 'సరూ' అని, నిర్మలను 'నిమ్మీ' అనీ....బంగారంలాటి పేర్లు ముక్కలు ముక్కలుచేసి, పారూ ...చారూ, అంటూ!" వంటింటివేపునుంచి వస్తున్న వాక్యాల పరంపరను వినేస్థితిలో లేడు విశ్వం.

"పారూ! పీదండకం అపుదూ....అరె.... అరె.వెళ్ళిపోతోంది....రావోయ్‌త్వరగా ..."

"ఏమిటా విచిత్రం?"

"అదుగో అటుచూడు...."

భర్త చూపిన వేపు చూచింది పార్వతి. జనసంచారం అట్టేలేని ఆ సందుమలుపులో నుంచి, రెండుజడలూ, నైలాన్‌చీరె తాలూకు అమ్మాయి ఆకారం తళుక్కున మెరిసి మాయమయింది!

"ఓస్ ఇంతేనా? ఇంకా ఏమిటో ననుకున్నాను...." అందులో విశేష మేమీ లేదని తేల్చేసింది పార్వతి.

"నువ్వు సరిగా చూళ్ళేదు కాబట్టి అలా అంటున్నావ్‌గానీ, చూచివుంటే మూర్ఛపోదువు ..."

"అలాగా! అంత బావుంటుందేమిటీ? ఇంతకూ ఎవరా అమ్మాయీ?" కుతూహలంగా అడిగింది పార్వతి.

"రోజూ నాతోపాటు మా ఆఫీసు వరకూ నడిచి వస్తుంది...., వచ్చే టప్పుడూ వస్తుంది. ఎవరో కాలేజి గర్ల్! ఆయినా సఖ్యం సాప్తపదీనం" అన్నారు ... ఆమె స్నేహం సంపాదించాలని మహా ఉబలాటంగా వుంది నాకు...."

చరచర వెనుదిరిగి వెళ్ళిపోతున్న పార్వతిని చూస్తూ నవ్వాడు విశ్వం.

మర్నాడు....

"పారూ, ఓ సారి, పార్వతీ! ఇలారా!"

"ఎందుకూ?"

"మా ఆఫీసులో కొత్త లేడీ టైపిస్టు చేరిం దీరోజు...."

"ఊఁ!"

"ఎలా వుంటుందో తెలుసా?"

"ఏమో నాకేం తెలుసూ?" పార్వతి కనుకొలకుల్లోని ఎరుపుదనం విశ్వాన్ని కవ్విస్తోంది.

"అదే చెబుతున్నా విను ... నవనవలాడే లేత తమలపాకులా, అప్పుడే వికసించిన తెల్ల గులాబీలా, నవయౌవన శోభతో...."

"చాల్లెండి! ఈ కబుర్లు వింటూ కూర్చుంటే అవతల కూర మాడిపోతుంది!"

"ఆడబుద్ధి పోనిచ్చావుగాదు." ఇల్లెగిరిపోయేలా నవ్వాడు విశ్వం.

మూడోరోజు....

"పార్వతీ....!"

"..... .... ...."

"పార్వతీ....!"

"..... .... ...."

''మై డియర్ పార్వతీదేవీ!''

సమాధానం రాకపోయేసరికి వంటింటి వేపు నడిచాడు విశ్వం. ఉల్లిపాయలు తరుగుతూన్న పార్వతి ముఖం కందగడ్డలా వుంది. సజల నేత్రాలతో తలెత్తి ఓసారి చూచి మళ్ళీ పనిలో మునిగిపోయింది.

''ఆహాఁ ఎంచక్కా వున్నావ్! 'కాటుక కంటి నీరు....' అంటూ పద్యం చెప్పాలని పిస్తోందిగాని. మనకూ. కవిత్వానికీ చాలా దూరమని తెలిసి మానేస్తున్నాను.''

''మంచిపని చేశారు'' ముభావంగా అని ఉల్లిపాయ ముక్కల్ని మరుగుతున్న పులుసులో పడేసింది పార్వతి.

''ముఖంచూడు ఎలావుందో....ఇదంతా అలకే?''

''అవును నా ముఖమెలా బావుంటుందీ? వీధిలో పోయే ఆడాళ్ళ ముఖాలూ, ఆఫీసులో లేడీ టైపిస్టుల ముఖాలూ అయితే బావుంటాయిగానీ....'' పార్వతి ఉక్రోషం విశ్వానికి గిలిగింతలు పెట్టింది.

''ఆ! ఈ మాటంటే గుర్తుకొచ్చింది సుమా! నిన్న రాత్రి సినిమాకెళ్ళానా? ముందువరసలో కూర్చున్నారో దంపతులు! ఆ విడెంత అందంగా వుందనీ? అతగాడెంత అదృష్టవంతుడో, అంత సౌందర్య రాసిని అర్థాంగిగా పొందగలిగాడు.కాకున్నా. పెళ్ళిచూపుల్లో నిన్నుచూచి నే నెంత భ్రమ పడ్డానూ....నీలోనే లోకంలో వున్న అందమంతా వుందని భ్రమించాను కూడా....'' క్రీగంట భార్యవేపు చూచిన విశ్వానికి ఆమె కళ్ళల్లో నీళ్ళు ఆనందాన్ని మరింతగా రేకెత్తిస్తున్నాయి.

''అరె - అరె.... ఏమిటా పరుగూ.... వినమంటూంటే....'' విశ్వంచేతిలో పార్వతి చేలాంచలం చిక్కుపడిపోయింది.

''అబ్బబ్బ! ఇక ఆపుతారా లేదా? నే నా నూతిలో దూకేస్తా నింకా మాట్లాడ్తే!'' పార్వతి దుఃఖం కట్టలు తెంచుకుంది.

''ఛ-ఛ ఊరికే చెప్పగానే కష్టమా? ఊరుకో. ఎంత చదువుకున్నా మీ ఆడాళ్ళలో అసూయ దాగే వుంటుంది సుమా! తమాషాగా ఏదో కబుర్లు చెబితే - ఛ - ఛ ఏదీ నవ్వు....ఒక్కసారి. ఆ! అలా.''

రోజు కొకసారేనా ఇలాటి సన్నివేశం మామూలయిపోయింది. అతడికి సరదా ఎక్కువౌతోంది. ఆమెకు కోపం బిగిపొర్లుతోంది.

• • •

ఆదివారం మధ్యాహ్నం....

ఏం కథనం కల్పించి పార్వతి నేడిపించాలా? అనే ఆలోచనతో సతమతమౌతున్నాడు విశ్వం. పార్వతి చేతే ఆడవాళ్ళకు గల అసూయా ద్వేషాలని నిరూపిస్తూంటే తనను పార్వతి మింగేలా చూస్తుంటే. ఆ అందమైన కళ్ళలో నీళ్ళు సుడులు తిరుగుతుంటే, తర్వాత తను ఓదార్పటం ప్రారెట్టులో విషయమయినా, ఎంత తమాషాగా వుంటుందీ....

''ఏమండీ! ఏమండోయ్. ఇలా రండొక్కసారి.''

వీధి వేపునుంచి పార్వతి కేక, ఆలోచనల కంతరాయం కల్గించింది.

''ఏమిటీ?''

''ఓసారి త్వరగా వద్దురూ....''



పార్వతి వరండాలో మునివ్రేళ్ళమీద నిల్చుని వీధివేపు చూస్తోంది....

"ఎవరు?" పార్వతి వెనకగా నిల్చుని తనూ అటువేపు చూచాడు విశ్వం.

"ప్చ్! వెళ్ళిపోయాడు...."

"ఎవరు?" విశ్వం కంఠస్వరంలో మార్పుకు పార్వతి ఆనందిస్తోంది.

"ఎంత అందంగా వున్నాడనీ? మగాళ్ళలో అంత అందమైనవాళ్ళుండటం అరుదే మరి!"

"ఇంతకూ ఎవరు వాడంటూంటే?" విశ్వం పిడికిళ్ళు చూస్తుంటే పార్వతికి నవ్వు ముంచుకు వస్తోంది.

"బావుంది! నాకుమాత్ర మేం తెలుసు ఎవరో...."

"ఇలా వీధిలో నిల్చుని, దారేపోయే మగాళ్ళను వర్ణించే పనేనా?" విశ్వం కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి.

"ఇది మరీబావుంది! అందమైన వస్తువు కన్పిస్తే, ఆదమరచి చూడటం కళ్ళకున్న స్వభావం ..."

'చాల్లే మాటలు నేర్చావ్!' విశ్వం చిర చిర లాడిపోతున్నాడు....

'ఏం మగాళ్ళే! ఏం మాట్లాడినా తప్పే!' పార్వతి పొంగి వస్తున్న నవ్వును పెదాల చాటునే అణిచివేస్తోంది.

కలకబారిన మనస్సుతో పడక కుర్చీలో వాలివున్న విశ్వానికి తమలపాకులు చీల్చి ఇస్తోంది పార్వతి....

'రాత్రి నాకో కల వచ్చిందండీ!'

'ఏమిటీ?' నిర్లిప్తంగా అడిగాడు విశ్వం.

'చెప్పనా?'

'చెప్పమనేగా?'

'మీకు కోపం రాదంటే చెబుతాను....'

'సర్లే! చెప్పుదూ....'

'మనిద్దరం చెట్టాపట్టాలేసుకుని షికారుకు వెళ్లామట.... చుట్టూ సీనరీ యెంత ఆహ్లాదకరంగా వుందనీ....! ఇల్లాగే ఇద్దరం సరదాగా మాట్లాడుకుంటున్నాం దగ్గరగా కూర్చుని....'

విశ్వం ఒక్కసారిగా ముందుకు వంగి కూర్చున్నాడు....'తర్వాత....?'

'అబ్బ ఎంత తియ్యటి కలండీ....' పార్వతి మైమరచిపోతోంది.

'చంపక త్వరగా చెప్పు పార్వతీ! పార్వతీ! నేనూ ఆ తియ్యదనం పంచుకుంటాను...' కుతూహలంగాఅడిగాడువిశ్వం.

"ఇంతలో ఓ యువతీ, బహుశా ఆవిడ అన్నయ్య కాబోలు, యువకుడూ వచ్చారు మనదగ్గరికి. మీరేమో ఆ అమ్మాయివేపు వెర్రిగా చూస్తున్నారు....నేనూ వాళ్ళవేపు చూచాను....అతగాడికోపం వచ్చేసింది.

"ఏయ్ మిస్టర్! ఏమిటావిచ్చిచూపూ?" అన్నాడు కోపంగా!

మీరు నమ్మండి మానండి....కోపంలో గూడా అతడెంత బావున్నాడనుకున్నారూ?"

పార్వతి కనుకొలకుల్లోనుంచి విశ్వంవేపు చూస్తోంది.

మరుగుతున్న నీళ్ళలో ఉడుకుతున్న బంగాళాదుంపలా కుతకుతలాడిపోతున్నాడు విశ్వం.

"మీరూ అతగాడూ ఘర్షణపడ్డారు.... ఫెడేల్ ఫెడేల్మని మీచెంపలు పగలగొట్టేస్తున్నా డతను...."పరాయి ఆడాళ్ళని.... అందులోనూ నా చెల్లెల్ని, నా ఎదురుగానే అలా నీచంగా చూడటమా?" అంటూ రెచ్చిపోతున్నాడతను...."

"చాల్లే వెధవకలా...." విశ్వం చర్రుమన్నాడు....

"అరె పూర్తిగాచెప్పనీండి. నన్ను...." పార్వతి ఆపటంలేదు. నిస్పృహాయుడై కూర్చిండిపోయాడు విశ్వం.

"ఇక నేను చూస్తూ వూరుకోలేకపోయాను. ఎంత చెడ్డా మీరు నా భర్తకదా? ఒకవేళ తప్పుచేస్తేమాత్రం. నా ఎదురుగానే అలాశిక్షిస్తుంటే నాహృదయంభరించగలదా? పరుగెత్తుకు వచ్చాను మీ ఇద్దరిమధ్యకూ.

"చూడండీ....మా వారు చిన్న కవి. అందుకే ప్రతి ఆడదాన్నీ అలా పరీక్షగా చూస్తుంటారు. అది కేవలం కళాత్మక దృష్టితోనే...." ఏదో నోటికొచ్చిన అబద్ధం చెప్పాను. అతడు క్షణకాలం నావేపు చూచి ఆగాడు. కానీ ఇంకా అతనిలో కోపచ్ఛాయలు తగ్గలేదు. అలాగే రొప్పుతున్నాడు

"ప్లీజ్! వారిని వదిలెయ్యండి నాకోసం" అన్నాను.

"అలా అన్నారు బావుంది. మీ లాటి అందమైన ఆడది కోరితే....మిస్టర్! ఇకనేనా బుద్ధిగా వుండు" అని అతడు నావేపు చూచి నవ్వాడు.

"అబ్బ! ఆ నవ్వెంత మధురంగా వుందనీ!"

"ఛీ! నోర్మూయ్! అందమైన వాడి నవ్వూ మధురంగా వుంటుంది నీకు. హద్దూ పద్దూలేకుంటే సరి" విశ్వం కోపంతో చిందులు తొక్కుతున్నాడు.

"అదేమిటండీ-అంత కోపం? కలను గురించి చెప్పినా తప్పే?" పార్వతి నవ్వు తెర ఆపుకోలేక పొరమారుతుంది.

"వెధవకలా - నువ్వూను. మన ఆలోచనల ప్రతిబింబాలే కలలు" విశ్వం పళ్ళు పిండి చేసేస్తున్నాడు.

'హుఁ మగబుద్ధి పోనిచ్చారు కాదు.... ఎంత చదువుకున్నా, ఎంత ఆదర్శాలు వల్లించినా, భార్య పరాయి మగాణ్ణి కన్నెత్తి చూస్తే చాలు, కుత కుత ఉడికిపోతారు....'

విశ్వం గబుక్కున పార్వతికి దగ్గరగా వచ్చాడు....

'నిజం చెప్పు పార్వతీ! నీకి కల నిజంగా వచ్చిందా లేక....?' అతడి బాధ చూస్తుంటే పార్వతికి నవ్వాగలేదు.

'ఏం? ఎందుకు రాకూడదూ? చూచిన ప్రతి ఆడదాన్నిగురించీ మీ కేవేవో ఆలోచనలు కలుగుతూంటాయని చెబుతూంటారే.... నా కలాటి కలలు వస్తే ఏం?'

మరింత పరీక్షగా చూస్తూ అడిగాడు విశ్వం.... 'నీకి కల రాలేదు.... అవునా? నా మాటలు నాకే అప్పజెప్పటానికి కల్పించావు కదూ?' దీనంగా అడుగుతున్న భర్తను ఇంకా ఏడిపించటం భావ్యం కాదనిపించింది పార్వతికి.

'శ్రీవారూ! ఎంత భార్యాభర్తలయినా, ఎంత సంస్కారపూరితులయినా, ఎంతటి విశాల హృదయులైనా, మనసులో రేగే ప్రతి భావమూ, అస్తమానూ, ప్రక్కవారికి చెప్పుకుంటే ఇలాగే వుంటుందండీ! కాబట్టే ఇద్దరికీ మధ్య ఎంత కాదన్నా సన్నని తెర వుండాలి కొన్ని విషయాల్లో.... నిజంగా ఒక వేళ అలాటి ఆలోచనలే వచ్చినా, అవి పదే పదే వ్యక్తం చేసుకోటం ఇరువురికీ క్షేమకరం కాదు....'

'హియర్.... హియర్.... ఇక చాలు పార్వతీ! దేవీ! నా హృదయరాణీ! ఇక చాలు! ఇకనుంచీ అలా నేను నీముందు నిన్నేడిపించటానికి పరాయి ఆడాళ్ళను వర్ణించను.... కానీ నాకు మాత్రం నీకలల్లో కన్పించే అందమైన మగాళ్ళను గురించి చెప్పకేం? నాకు నిజంగానే ఏడుపొస్తుంది...' చిన్నపిల్లాడిలా, పమిటి చెంగులో ముఖం దాచుకుంటూ చెబుతున్న విశ్వాన్నిచూస్తూ నిండుగా నవ్వింది పార్వతి!

000